వ్యాసమహర్షి - నాటి నైతిక విలువలు

Dr. N.V. Koteswara Rao
(Formerly, Deputy
Director General, Southern Region, National Informatics Centre,
Hyderabad. Contact Ph: 040-27702732, Cell:9866662732) 31.7.07

వ్యాసపూర్ణిమ సందర్భమున వ్యాసమహర్షికి నమస్సుమాంజలులు.

నారాయణ సమారంభాం
శఙ్కరాచార్య మధ్యమాం
అస్మదాచార్య పర్యన్తాం
వన్దే గురుపరమ్పరాం.

అని పెద్దలు సభారంభమునకు ముందుగ గురుపరంపరకు నమస్కరింతురు. గురువు అజ్ఞానమును పోగొట్టును కనుక వారికి ప్రథమముగ నమస్కరించుట ఆచారము, పరిపాటి. గురుపరంపరలో మొదటిగురువుగ పరిగణింపబడిన వ్యాసుడు మహనీయుడు, పూజ్యుడు. వ్యాసమహర్షి వసిష్ఠునికి ముదిమనుమడు, శక్తి యొక్కమనుమడు, పరాశరాత్మజుడు, శుకమహర్షికి తండ్రి. ఆదిముని యని పేరుగాంచిన వ్యాసమహర్షికి ప్రణమిల్లి, వారి యాశీస్సులను పొంది ఆచార్య పరంపరకు కృతజ్ఞతాపూర్వక వందనములను నమ్రతతో అర్పించి పెద్దలను గౌరవించి సభారంభము గాని కవితారంభము గాని చేయుట పెద్దలు చూపిన మన ఆచారము.

విష్ణుసహస్రనామ స్తోత్రపాఠమునందు విఘ్ననివర్తకు ప్రణమిల్లిన వెంటనే వ్యాసమహర్షి ని స్తుతించి వారికి నమస్కరించుట గమనార్హము.

వ్యాసం వసిష్ఠ నప్తారం శక్తేః పౌత్రమకల్మషమ్,
పరాశరాత్మజం వన్దే శుక తాతం తపోనిధిమ్.

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే,
నమోవై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః.
అవికారాయ శుద్ధాయ నిత్యాయ పరమాత్మనే,
సదైకరూపరూపాయ విష్ణవే సర్వజిష్ణవే.

వ్యాసమహర్షి రూపము విష్ణువుయొక్క రూపమని, వ్యాసుడే విష్ణువు, విష్ణువే వ్యాసుడని వారిరువురి అభేదమును శ్లాఘించుట వ్యాసుడు బ్రహ్మజ్ఞాని యని తెలుపుటయే. ఎటువంటి వికారములకు లోను కాని వాడు, శుద్ధుడు, నిత్యుడు, పరమాత్మ, సర్వమును (కామ క్రోధాదులను బంధములను)జయించిన వాడు నగు వ్యాసుడు విష్ణువనుటలో బ్రహ్మజ్ఞానికి గల సర్వవ్యాపకత్వము తెలియజేయబడు చున్నది.

బ్రహ్మజ్ఞానమునందిన మహర్షి తోటి మానవుల అభివృద్ధి కొఱకు పాటుపడి ధర్మసంస్థాపన చేయుటకై పదునెనిమిది పురాణములలో వేదప్రోక్తములగు ధర్మములను వివేకమును అందింపచేయుట మానవాళి అదృష్టము. బ్రహ్మజ్ఞాని యగు వాడు తనకు గలిగిన జ్ఞానమును ఇతరులకు కూడ పంచి వారిని కూడ తనంతటి వారిని చేయవలయునని ఉత్సాహపడుట సహజత్వమే అయినను ఇంతటి బృహత్కార్యమును ఏ యితర బ్రహ్మజ్ఞానియు చేసియుండలేదు. ఒక రాసిగ నుండిన వేదములను ఋగ్యజుస్సామాథర్వణ వేదములుగ విభజించినందున కృష్ణద్వైపాయనుడను బ్రహ్మర్షి ని వేదవ్యాసుడనిరని పెద్దల వాక్యము.

ఇంతటి బ్రహ్మజ్ఞాని కూడ సాధారణ మానవుని వలనే కన్పట్టినాడు. ప్రతి మానవుడు తనకు తెలిసిన విషయములను పలువురు తోటి మానవులకు తెలిపి తద్వారా వారును మంచి మార్గమున చరించవలెనని కోరుకొనును. ఈ ఆచారము నేటి ఆధునిక ప్రపంచమున కూడ సజీవముగ నుండుట దైవచిత్రము. నేటి ఉధృత టి.వి. ప్రవాహమున వివిధ కాల్వల (ఛానెల్స్) ద్వారా కొట్టుకొని పోవు చున్న నైతిక విలువలను ఆపవలయు నని తమ

పిల్లలు సన్మార్గ ప్రవర్తనులు కావలయుననని ప్రతి తల్లి, తండ్రి కోరుకొనుట నేటికిని నిలచియుండుట ముదావహము. దంపతులిరువురు ధనార్జనాసక్తులై రోజంతయు శ్రమించియు తమ పిల్లలను మంచి మార్గమున పెట్టుటకు నీతి కథలను
చెప్పుటయో వారికి ఆ కథల పుస్తుకములనంద జేసి వారి చేత చదివించుటయో చేయుచున్నారు. కనుకనే త్రేతాయుగమునాటి రామాయణ గాధలు ద్వాపరయుగము
నాటి మహాభారత కథలు నేటికిని వినవచ్చుచున్నవి. ఆ యా కథలు మానవ విలువలను, ధర్మములను తెలుపుటయే గాక మానవుని ధర్మనిరతుని చేయుటకు దోహదపడు చున్నవి.

ఎవరో కొందఱు స్వార్థపరాయణులు తమకు భగవంతుడిచ్చిన విజ్ఞానమును అమ్ముకొందురు (నేటి కాపీరైటులు, పేటెంటులు వంటివి). కాని మానవాళికి నిస్స్వార్థదృష్టితో తనకు తెలిసిన మంచి విషయములను అందఱకు పంచవలయునను కోరిక గలిగిన మహనీయులు ఎందరో ఉన్నందుననే నేటికిని మానవప్రగతి కొనసాగుచున్నది.

మనకు పోతన శ్లాఘనీయుడు. వ్యాసమహర్షి రచించిన శ్రీమద్భాగవతమును పండిత, పామరజన హృదయానందదాయినిగ పోతన తెనిగించి డబ్బుకు అమ్ముకోనని "బాలరసాలసాల నవపల్లవ కోమల కావ్యకన్యకన్ ఊళు(ళ)ల కిచ్చి యప్పడుపు కూడు భుజించుటకంటె" సత్కవులు వ్యవసాయదారులై తమ భుక్తిని తాము సంపాదించు కొనుట గాని అదియును వీలుకానిచో కందమూలములతో తన కుటుంబమును పోషించుకొనుట గాని మేలని నమ్మబలికి ఎన్ని కష్టములకైనను ఓర్చి తన మాటనిలబెట్టుకొని మనకు నైతిక మార్గదర్శి అయ్యేను. భగవత్ప్రేరణతో తాను శ్రీమద్భాగవతమును తెనిగించుచున్నానని విన్నవించుకున్నాడు. భగవత్కారణముగ చేయు పనికి విలువ కట్టుట హాస్యాస్పదముకదా. నేటి కాలమున కూడ కొందఱు ఈ కోవకు చెందిన వారు కలరు.
ఉదాహరణకు -

తన జీవితమునంతను పునరావృత్తిరహిత రోగనివృత్తి మార్గమునన్వేషించుట కొఱకు ధారపోసి తగు విజ్ఞానమును పొంది నిస్స్వార్థబుద్ధితో హోమియో వైద్యవిజ్ఞానమును ఉచితముగ పంచిపెట్టిన జర్మను దేశస్థుడగు వైద్యవిదుషీమణి హనీమన్ ప్రపంచమునందలి మానవాళికంతకు శ్లాఘనీయుడు.

తాత్కాలికములగు రోగనివృత్తిని తెలిపిన వానికే మనము కృతజ్ఞత తెలుపుచుండ భవబంధవిమోచనమునకు పరమమగు మార్గములను చూపిన మహర్షి వ్యాసుని పొగడుటకు మన శక్తి చాలదనుట అతిశయోక్తి కానేరదు. ముక్తిమార్గమునందాసక్తి కలిగించుటయే పరమార్థముగ పెట్టుకొని భారత భాగవతముల వంటి పురాణములను పదునెనిమిదింటిని రచించి మానవులలోని అధర్మప్రవర్తనను అరికట్టి ధర్మనిరతులనుగ తీర్చిదిద్దవలయునని బృహత్తమ కృషిచేసిన నిత్యుడు వ్యాసమహర్షికి ప్రణామముల నర్పించుట మనకు మహదానందదాయకము.

పరిశీలింపగ, అష్టాదశపురాణములలో పండిత పామరజనముల యందు ప్రాచుర్యమును పొందినది మహాభారతము. గారెలకు భారతమునకు గల సంబంధమేదియో కాని "తింటే గారెలు తినాలి వింటే భారతం వినాలి " అను తెలుగు నానుడి తెలుగునోటికి సుపరిచితమే. బహుశ ప్రతిమానవుడును తన బుద్ధికి అందిన దానినే అర్థము చేసికొనును కనుక భారతమునందలి పాత్రలకు గల విలువలను (మంచివి, చెడుగువి కూడ) పోషించు ప్రజానీకము నేటికిని ఉండుట వలననే భారతమునకు ఇంతటి ప్రాచుర్యము ఇంకను నిలచియున్నది. మంచి చెడుగుల ద్వంద్వము కలకాలము నిలచి యుండునను విషయము తెలిసియే బ్రహ్మజ్ఞాని యగు వ్యాసమహర్షి మనకొఱకు శ్రమించినాడు. కౌరవ పాండవులు భౌతికముగ అంతరించినను వారి అంతరంగ భావములను నేటికిని సజీవముగ నుంచుచున్న సోదరీసోదరులు న్యాయస్థానముల చుట్టు తిరుగాడుట మనకు తెలిసినదే.

మహాభారత కథలనన్నింటిని వినిన పిదప ముక్తికి, జ్ఞానమునకు

సోపానములగు విష్ణు సహస్రనామస్తోత్రము, భగవద్గీతలు మహాభారతమున రచింపబడుటయే భారతీయుల మహద్భాగ్యమని తోచును. విజ్ఞులకు అజ్ఞులకు అందుబాటులో నున్న ఈ రెండును మహాభారతమును శిరోధార్యముగ చేసినవి.

మహాభారతమున వ్యాసమహర్షి ఒక్కొక్క గుణమునకు ఒక్కొక్క పాత్రను సృష్టించి మానవులకు కలుగు ధర్మ సందేహములను చక్కగ తొలగించు ప్రయత్నము చేసెను. అర్హుడు కాని వానికి మారణాయుధములగు అస్త్రశస్త్రములను నేర్పరాదని క్షత్రియుడగు కర్ణుని విషయమున పరశురాముని ద్వారా, బోయరాజు కుమారుడగు ఏకలవ్యుని విషయమున ద్రోణుని ద్వారా నిర్ద్వంద్వముగ చెప్పించినాడు. మానవ విలువలకు నాడిచ్చిన విలువ నేటి విశాలహృదయులకు లేనందుననే ఎవరైనను ఏ విద్య నైనను అభ్యసించ వచ్చునని మన ప్రజాప్రభుత్వముల మతము. కనుకనే మనము నేడు కిడ్నీలను దొంగిలించు శస్త్రవైద్యశిఖామణులను గూర్చి వార్తాపత్రికలద్వారా తెలిసి కొనగలుగు చున్నాము. నిత్యుడగు వ్యాసమహర్షి ఇటువంటి నైతిక దుఃస్థితిని ఊహించియే శిష్యుని అర్హతలను తెలిపియుండవచ్చునని తోచును.

మానవునకు గలుగు యశోకాంక్ష (కండూతి) ఎంతటి వారినైనను అధర్మప్రవర్తనులనుగ చేయునని త్యాగశీలి, ధనుర్విద్యాధురీణునగు కర్ణుని ద్వారా చెప్పకయే చెప్పినాడు. విధివిధానము వలన కర్ణుడు సూర్యవరప్రసాదియై కుంతి చేసిన మన్త్రపరీక్షకు నిదర్శనముగ కుంతీ తనయుడైనను, రాధేయుడుగనే లోకవిదితుడయ్యెను. సూతపుత్రుని వలెనే చూడబడెను. మహాభారత యుద్ధమునకు కర్ణుని ప్రోత్సాహమే దుర్యోధనునికి ఆయువుపట్టయ్యెను. అర్జునుని సంహరింపగలిగినచో రాజ్యలక్ష్మి కౌరవుల కైవసమగునని రాధేయుడు తాను బ్రాహ్మణుడనని పరశురామునితో అబద్ధమాడి తాను సంపాదించిన బ్రహ్మాస్త్రము సమయమునకు జ్ఞప్తికి రాని విధముగ శాపమును పొందినాడు. తనకు మించిన పని కర్ణునికి తలవంపులు తెచ్చినది.

త్యాగశీలియగు కర్ణుడు తనకు పుట్టుకతో వచ్చిన కవచకుణ్డలములను మహాభారత సంగ్రామ సమయమున దానముగ ఇచ్చుట త్యాగమునకు పరాకాష్ఠయని వ్యాసమహర్షి కర్ణుని ద్వారా నిరూపించినాడు. "త్యాగేనైకే అమృతత్త్వమానశుః" అను ఉపనిషద్వాక్య నిరూపణ కర్ణుని ద్వారా చేయించినట్లు తోచును. ఈ త్యాగము అతని విలువిద్యా కౌశలమునకు ఆటంకము కాలేదు. భూ దేవి వల్లను పరశురాముని వల్లను పొందిన శాపములకాతడు హతుడయ్యెనని తోచును.

ఏకలవ్యుని విషయమున త్యాగము, గురుభక్తి బహు గొప్పగ ప్రదర్శింపబడినవి. తనకు ప్రత్యక్షముగ విలువిద్యనేర్పనని చెప్పిన ద్రోణాచార్యునే తనకు విలువిద్యా గురువుగ భావించి, మట్టితో ద్రోణుని బొమ్మ నొకదానిని చేసి దానినే తన గురువుగ ఊహించి, కదలని మెదలని ఆ మట్టిబొమ్మద్వారా తన స్వయంకృషితో విచక్షణాజ్ఞానముతో, సునిసిత బుద్ధితో, విలువిద్యారహస్యములను భేదించి ద్రోణాచార్యునికన్న గొప్పవాడని, అంతటి వాడు ముల్లోకములలో లేడని అర్జునుడే ద్రోణునకు విన్నవించుకొనునట్టి ఘనతను సంపాదించిన ఏకలవ్యుని గురుభక్తికి పరాకాష్ఠగ వ్యాసుడు వర్ణించినాడు.

మరియొక విషయము-

ప్రత్యక్షముగ నున్న గురువుకన్నను పరోక్షముగనున్న గురువే ఆత్మసాక్షాత్కారమునకు గొప్పగ దోహదము నిచ్చునని, ఎవరైనను అకుంఠిత స్వప్రయత్నముతో, బుద్ధికుశలతతో (బుద్ధిః కర్మానుసారణి కనుక) ఏ విద్యనైనను, ఏ కార్యమునైనను సాధించవచ్చునని వ్యాసమహర్షి ఈ పాత్రద్వారా తెలియజెప్పినాడు.

ఇంతటి ప్రజ్ఞను స్వయంకృషిద్వారా పొందిన ఏకలవ్యుడు- ద్రోణాచార్యుడు అడిగిన వెంటనే సంకోచింపక విలువిద్యాకౌశలమునకు ప్రాణప్రదమైన తన

కుడిచేతి బొటనవ్రేలిని కోసి గురుదక్షిణగ ఇచ్చిన ఏకలవ్యుడు- బోయరాజు కొడుకైననేమి- త్యాగమున తనను మించిన వాడు లేడని నిరూపించినాడు. ఆత్మజ్ఞానము లేని వాడు ఇంతటి త్యాగము చేయలేడు. విగ్రహారాధన యని హేళన చేయు నేటి ఆధునిక తార్కిక ప్రజానీకమునకు - ఆ విగ్రహము ద్వారానే ఆత్మజ్ఞానమును పొందవచ్చునని, సగుణ నిర్గుణోపాసనల అవధులను కూడ దీని ద్వారా దాటవచ్చునని ఏకలవ్యుని ద్వారా చాటి చెప్పిన వ్యాసమహర్షికి హార్దిక నమస్సుమాంజలులు గాక మరి యేమి ఇవ్వగలము?

ధర్మములను తెలిసికొని వాటిని ఆచరించినను భగవద్భక్తి లేనిచో మానవునకు మనఃశాన్తి ఉండదను విషయమును అర్జునుని ద్వారా చూపించి భగవద్గీతలను భగవంతుడగు శ్రీకృష్ణుని ద్వారా చెప్పించినాడు. ధర్మములను విశ్లేషించి మహాభారతమును రచించియు తనకు మనఃశాన్తి లేకపోవుటను తెలిసికొని నారదమహర్షి ప్రేరణతో భగవంతుని లీలలను, భక్తుల చరిత్రలను శ్రీమద్భాగవత పురాణముగ రచించి వ్యాసమహర్షి భక్తియనగ ప్రహ్లాదుని, నిస్స్వార్థప్రేమ యనగ గోపికలను మనకు జ్ఞప్తికి వచ్చునట్లు తెలియజెప్పినాడు.

వ్యాసాయ పరబ్రహ్మణే నమః